గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్‌ను ఆయన స్వగృహంలో కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అలాగే సబ్ కలెక్టర్ వైశాలి కూడా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు.

-ప్రజాశక్తి, పార్వతీపురం

బెల్టు షాపుల ఖిల్లా మన్యం జిల్లా

- క్వార్టర్ పై 40నుంచి 50 రూపాయల బాదుడు
- మందుబాబుల జేబులకు చిల్లు
- సిండికేట్లకు ఊతం
- కనిపించని చీప్ లిక్కర్
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో మందుబాబుల జేబులకు దండిగా చిల్లులు పడుతున్నాయి. ఊరూర బెల్టు షాపులు రాజ్యమేలుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 52 వైన్ షాపులున్నాయి. ఇవే కాక కల్లుగీత కార్మికులకు మరో నాలుగు మంజూరయ్యాయి. ప్రతి వైన్ షాపు పరిధిలో సుమారు 10 నుంచి 15 బెల్ట్ షాపులు వెలిసిపోయాయి. నేరుగా షాపుల్లో జరిగిన మద్యం విక్రయాల కంటే బెల్ట్ షాపుల ద్వారా సాగుతున్న అమ్మకాలే ఎక్కువగా ఉంటున్నాయి. బెల్ట్ షాపులకు క్వార్టర్ బాటిల్‌పై పది రూపాయలు అదనంగా వ్యాపారులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపుల నిర్వాహకులు మాత్రం ఒక్కో క్వార్టర్ బాటిల్‌ను రూ.40 నుంచి రూ.50 వరకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మందుబాబులు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా వైన్ షాపు యజమానులకు 20శాతం కమిషన్ ఇవ్వకపోవడంతో వారు ఇబ్బడిముబ్బడిగా బెల్ట్ షాపుల సామ్రాజ్యం విస్తరించుకుని ప్రభుత్వపరంగా వచ్చే నష్టాన్ని భర్తీ చేసుకుంటున్నారు. మందుబాబుల జేబులకు దండిగా చిల్లులు పెడుతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

ఎక్సైజ్ శాఖ కనుసన్నల్లోనే బెల్ట్ షాపులు

ప్రభుత్వం దృష్టిలో బెల్ట్ షాపులు లేనట్లే కానీ స్థానిక ఎక్సైజ్‌శాఖ అధికారుల కనుసన్నల్లోనే అవి నడుస్తున్నాయి. బెల్ట్ షాపులు నిర్మూలించాలని ప్రభుత్వం ప్రకటనలు చేయడమే తప్ప అవి కనుమరుగైన దాఖలాలు ఎక్కడా లేవు.

ఏజెన్సీలో బెల్టుషాపు

వీటి నిర్వాహకులపై అరకొర కేసులు నమోదు చేసి ఎక్సైజ్ అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. బెల్ట్ షాపులు ఎక్కడా లేవని అధికారులు పైకి చెపుతూ తెరవెనుక నుంచి వాటికి సహాయ సహకారాలు పుష్కలంగా అందజేస్తున్నారు. జిల్లాలో అనేక గ్రామాల్లో వేలంపాటల ద్వారా బెల్ట్ షాపులు లక్షల రూపాయలకు పాడుకుని నిర్వాహకులు దక్కించుకున్నారు. గిరిజన గ్రామాల్లోనూ స్థానిక గ్రామపెద్దల సహకారంతో నిర్వహించిన వేలంపాటలో బెల్ట్ షాపులు కైవశం చేసుకున్న నిర్వాహకులు క్వార్టర్ బాటిల్‌పై రూ.40 నుంచి రూ.50 వరకు ధర పెంచుకుని విక్రయించుకుంటున్నారు. వైన్ షాపులకు వెళ్లలేక మారుమూల గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపుల్లోనే మందుబాబులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో యథేచ్ఛగా బెల్ట్ షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది.

అధికారులకు నెలనెలా ముడుపులు

జిల్లాలో వైన్ షాపుల నుంచి అధికారులకు నెలనెలా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కిందస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎక్సైజ్, పోలీసు అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ప్రచారం సాగుతోంది. ఒక్కో వైన్ షాపు నుంచి నెలకు రూ.10వేలు నుంచి రూ.20వేలు వరకు మామూళ్లు అందుకున్నట్లు తెలుస్తోంది. అందుచేతనే బెల్ట్ షాపుల నిర్మూలనపై అధికారులు దృష్టి సారించడం లేదనేది స్పష్టంగా కనిపిస్తోంది. వందల సంఖ్యలో ఉన్న బెల్ట్ షాపులు అనధికార వైన్ షాపులు మాదిరిగానే నిర్వహిస్తున్నారు. నాటు సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్న ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపుల నిర్వహణపై ఉదాసీనంగా వ్యవహరించడం చర్చనీయాంశమవుతోంది.

చీప్ లిక్కర్ ఎక్కడ?

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని నెలలకు ప్రభుత్వ వైన్ షాపులు రద్దు చేసి ప్రయివేటు వ్యాపారులకు కట్టబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం విక్రయించారని, దీంతో చాలా మంది మందుబాబులు అనారోగ్యంతో మరణించారని టిడిపి కూటమి పార్టీలు ప్రచారం చేశాయి. తాము అధికారంలోకి వస్తే వంద రూపాయలకే నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లు గానే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మందుబాబులకు ఇచ్చిన హామీ మేరకు వంద రూపాయలకే క్వార్టర్ చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టింది. దీంతో వంద రూపాయలకే మద్యం దొరుకుతుందని వారు తెగ సంబరపడి పోయారు. అయితే వారిలో ఆ ఆనందం మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. వంద రూపాయల చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. మందుబాబులను మైకంలో దింపి చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్‌ను కనిపించకుండా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల షాపు యజమానులకు పెద్దగా లాభాలు రావడం లేదనే కారణంతో రూ.200 పైబడిన క్వార్టర్ బాటిల్స్ నే విక్రయిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మందుబాబులు రూ.200 పైబడిన క్వార్టర్ బాటిళ్లనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా గ్రామదేవతల పండుగల సమయంలో చీప్ లిక్కర్ క్వార్టర్‌ను కనిపించకుండా చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వంద రూపాయలకే క్వార్టర్ బాటిల్ నీటి మూటగానే మిగింది.

గురజాడ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ఒక రాష్ట్ర పండగలా ప్రతి ఏటా నిర్వహించాలని పలువురు కవులు, రచయితలు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో గురజాడ జయంతి సందర్భంగా సభ ఏర్పాటు చేశారు. సంఘ సంస్కర్తలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. గురజాడ అప్పారావు రచనలు సమాజానికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు, పక్కి రవీంద్ర మాష్టారు, మల్లిపురం జగదీష్, గోరా, గాయత్రి, అప్పారావు, గాయత్రి, శాంతి, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత స్థానిక జిల్లా ఆసుపత్రి సెంటర్‌లో గల గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కొమరాడ: ప్రముఖ కవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. కొమరాడలో గురజాడ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహిత్యకారుల్లో ఒకరని కొనియాడారు. ఆయన చేసిన రచనలు ఈనాటికీ ప్రజలు మన్ననలను పొందుతున్నాయన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో ఆయన రచనలు చేశారన్నారు. ఇలాంటి సందర్భంలో ఆయన రాసిన కన్యాశుల్కం నాటకం ఒకటన్నారు. అభ్యుదయ కవిత పితామహుడు అని బిరుదు పొందిన అప్పారావు తెలుగు సాహిత్యంలో వాడుకు భాష వరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడని చెప్పవచ్చు అని అన్నారు. ఆయన యొక్క ఆశయ సాధన దిశగా ఇప్పుడు మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధంగా ఉండాలని, ఆ దిశగా ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలా మహిళలు కీలక పాత్ర వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురజాడ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ వివిజి శంకర చేతుల మీదుగా గురజాడ చిత్ర పటానికి పూలదండ వేసి ఆయన సేవలను కొనియాడారు. గురజాడ సాహిత్యంతో సంఘసంస్కరణలో నెలకొల్పి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. గురజాడ అప్పారావు నవయుగ వైతాళికుడిగా పేరుపొందారని, కన్యాశుల్కం ద్వారా వరకట్నం దురాచారాన్ని రూపుమాపారని అన్నారు. అలాగే దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా అంటూ దేశభక్తి గేయం రచించి దేశభక్తిని పెంపొందించారని అన్నారు. అనంతరం శాఖా గ్రంథాలయం వార్షిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్ పి.శ్రీరాములు, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

పార్వతీపురంలో గురజాడ విగ్రహానికి పూల మాల వేస్తున్న సాహితీవేత్తలు

కొమరాడలో గురజాడ చిత్రపటానికి పూలు వేస్తున్న సిఐటియు నాయకులు

నేడు గురజాడ జయంతోత్సవ వేడుకలు : కలెక్టర్

పార్వతీపురం : మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతోత్సవాన్ని సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ నూతన సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురజాడ జయంతి వేడుకలకు జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని, వారితో పాటు ఔత్సాహికులు అందరూ ఆహ్వానితులేనని ఆ ప్రకటనలో వివరించారు.

గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ పనులు పూర్తి చేయాలి

నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

ప్రజాశక్తి -కురుపాం

కురుపాం వద్ద నిర్మిస్తున్న గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ పనులను పూర్తి చేసి, తరగతులను ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గిరిజనులతో కలిసి ఇంజినీరింగ్ కాలేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ పనులు ప్రారంభించి దాదాపు ఐదేళ్లు కావస్తున్నా ఇంతవరకు పనులు పూర్తి చేయకపోవడమంటే గిరిజన విద్యార్థులకు, గిరిజనులకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. ఇప్పటికే గిరిజన ఇంజినీరింగ్ కాలేజీకి సంబంధించి బోధన, బోధనేతర సిబ్బందిని నియమించినట్టు తెలుస్తుందని, కానీ గిరిజన విద్యార్థులకు మాత్రం ఇంజినీరింగ్ విద్య అందుబాటులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఇంజినీరింగ్ కాలేజీ పనులు పూర్తి చేసి తరగతులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన ఇంజినీరింగ్ కాలేజీకి భూములు త్యాగం చేసిన టేకరికండి, చంద్రశేఖర్ రాజపురం గిరిజనులకు భూమికి నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నష్టపరిహారం కోసం పోరాటం చేస్తున్న సందర్భంలో రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పోరాటంలో పాల్గొన్నారని, కురుపాంలో జరిగిన రాస్తారోకోలో అరెస్ట్ కూడా అయ్యారని గుర్తు చేశారు. జగదీశ్వరి ఎమ్మెల్యే అయిన తర్వాత న్యాయం జరుగుతుందని గిరిజనులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. అయినా ఎమ్మెల్యే ఆ దిశగా చర్యలు ప్రారంభించలేదని, శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇచ్చిన మెమోరాండంలో గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ పనులు పూర్తి చేసి క్లాసుల ప్రారంభించారని చెప్పారు తప్ప కాలేజీకి భూములు ఇచ్చిన గిరిజనులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు ఎక్కడా పత్రికల్లో రాలేదని అన్నారు. పోరాటం చేసిన జగదీశ్వరి గిరిజనులకు న్యాయం చేయకపోతే ఎవరు చేస్తారని గంగు నాయుడు ప్రశ్నించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో గిరిజన ఇంజినీరింగ్ కాలేజీపై సమగ్రంగా ప్రస్తావించి, కాలేజీకి భూములిచ్చిన గిరిజనులకు పరిహారం ఇప్పించే బాధ్యత ఎమ్మెల్యేపై ఉందని అన్నారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే రానున్న కాలంలో గిరిజనులతో మలివిడత పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కూరంగి సీతారాం, నిర్వాసిత గిరిజనులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, గిరిజనులు

గిరిజన సర్పంచ్‌పై కక్ష సాధింపు

- తప్పుడు ఫిర్యాదుతో చెక్ పవర్ రద్దు
- చక్రం తిప్పిన టిడిపి మండల అధ్యక్షుడు
- ఒత్తిళ్లకు తలొగ్గిన డిపిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అధికారపార్టీ నాయకుల ఆగడాలు శృతి మించుతున్నాయి. తమ అరాచకాలకు అడ్డొచ్చిన వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ముఖ్యంగా పార్వతీపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అండదండలతో మండల నాయకులు రెచ్చిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. మండలంలోని రావికోన సర్పంచ్ కద్రక రామస్వామి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు ఉత్తర్వులు జారీచేశారు. కద్రక రామస్వామి గిరిజన నాయకుడు, రావికోన పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. ఆయన పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో డివిజినల్ పంచాయతీ అధికారి విచారణ చేపట్టారు. విచారణలో సర్పంచ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని డిఎల్‌పిఒ తేల్చారు. దీనికి అధికారులు ఈనెల 15 మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్ రామస్వామికి షోకాజ్ నోటీసు అందజేశారు. షోకాజ్ నోటీసులో పేర్కొన్న అంశాలపై సంజాయిషీ మూడు రోజుల్లో ఇవ్వాలని పేర్కొన్నారు. నిర్దేశించిన గడువులోగా సంజాయిషీ ఇవ్వడానికి సర్పంచ్ రామస్వామి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి ఈనెల 18న వెళ్లారు. అయితే కార్యాలయం ఎఒ లేరని సంజాయిషీ పత్రాన్ని కార్యాలయం సిబ్బంది తీసుకోలేదు. 19న ఉదయం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ చేతికి సంజాయిషీ పత్రం అందజేశారు. సంజాయితీ పత్రం మూడు రోజుల్లో ఇవ్వాలంటే ఈనెల 18 మూడు గంటల్లోగా అందజేయాలి. అయితే నిర్దేశించిన గడువులోగానే సంజాయిషీ పత్రాన్ని అందజేయడానికి సర్పంచ్ రామస్వామి కార్యాలయానికి వెళ్ళినా కార్యాలయం ఎఒ లేరని తీసుకోలేదు. అంటే జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం అధికారులు కూడా ఉద్దేశపూర్వకంగా సర్పంచ్ సంజాయిషీ పత్రాన్ని తీసుకోకుండా తప్పించుకున్నారనేది స్పష్టం గా కనిపిస్తోంది. 19న ఉదయం సీనియర్ అసిస్టెంట్ చేతికి సంజాయిషీ పత్రాన్ని ఇవ్వాలని చెప్పిన ఎఒ 18న అదే పని ఎందుకు చేయలేదనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ ఎపిసోడ్‌లో మండల టిడిపి అధ్యక్షుడు బోను చంద్రమౌళి కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకి సన్నిహితుడైన చంద్రమౌళి, సర్పంచ్ రామస్వామి మధ్య గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. రావికోన పంచాయతీలో విఒఎ నియామకం విషయంలో చంద్రమౌళి సిఫార్సుకు రామస్వామి అడ్డుపడ్డారు. గ్రామానికి సంబంధించిన విఒఎ నియామకం అన్ని మహిళా సంఘాల ఆమోదం జరగాలని సర్పంచ్ రామస్వామి పట్టుపట్టారు. అయితే తాను సిఫార్సు చేసిన వ్యక్తిని విఒఎగా నియమించాలని చంద్రమౌళి డిమాండ్ చేశారు. చంద్రమౌళి సిఫార్సుకు అనుగుణంగా విఒఎ నియామకం జరగలేదనే కక్షతో సర్పంచ్ రామస్వామిపై కొంతమంది వ్యక్తులతో తప్పుడు ఫిర్యాదు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఫిర్యాదు ఆధారంగా జిల్లా అధికారులు విచారణ జరిపి సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు.

గిరిజన సర్పంచ్ పై కక్ష సాధింపు తగదు : సిపిఎం

పార్వతీపురం మండలంలోని రావికోన సర్పంచ్ కద్రక రామస్వామిపై కక్ష సాధింపు తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు చెప్పారు. ఆదివారం ఆయన సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల టిడిపి అధ్యక్షుడు బోను చంద్రమౌళి ఒత్తిడికి తలొగ్గిన డిపిఒ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. రావికోనకు చెందిన విఒఎ నియామకం విషయంలో మండల టిడిపి అధ్యక్షుడు సిఫార్సును సర్పంచ్ రామస్వామి అడ్డుకున్నారనే కక్షతో పంచాయతీ నిధుల వినియోగంపై తప్పుడు ఫిర్యాదు చేయించి విచారణ జరిపించారని చెప్పారు. ఈ వ్యవహారంలో టిడిపి నాయకులు చెప్పినట్లుగా జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు వ్యవహరించడం కరెక్ట్ కాదన్నారు. టిడిపి చెప్పినట్లుగా చేసుకుంటూ పోతే జిల్లా అధికారులే ఇరకాటంలో పడతారని హెచ్చరించారు. వెంటనే సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన వారపు సంతల్లో వైద్య శిబిరాలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని మారుమూల ప్రాంత ప్రజలకు గిరిజన వారపు సైతం వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు సంతల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. సంతలకు విచ్చేసే ప్రజల ఆరోగ్య అవసరాల మేరకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్త పరీక్షల్లో వ్యాధులు నిర్ధారణ అయితే వారికి ఉచిత వైద్యంతో పాటు మందులను సరఫరా చేయాలన్నదే తన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇందుకు గానూ జిల్లాలో గల 11 మండలాల్లోని 20 ప్రదేశాల్లో సంతలు జరుగుతున్నాయని, ఆయా సంతల్లో వైద్య శిబిరాలను సోమవారం నుంచి నిర్వహించాలని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి రోగులు వచ్చేలా ముందుగా గ్రామ, మండల స్థాయిలో తెలియపరచాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం పాలకొండ మండలం నవగాం, కురుపాం మండలం నీలకంఠాపురం, సీతంపేట మండలంలో సీతంపేటలో జరుగు సంతల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. అలాగే మంగళవారం సాలూరులోని నేరెళ్లవలస, గుమ్మలక్ష్మీపురంలోని తాడికొండ, కురుపాంలోని మొండెంకల్లు ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం పాచిపెంట మండలం నాందేడువలస, సీతంపేటలోని మర్రిపాడు, గుమ్మలక్ష్మీపురంలోనూ, గురువారం పార్వతీపురంలోని మార్కెట్ యార్డు వద్ద, మక్కువ మండలం దుగ్గేరు, కురుపాంలోని ప్యాలెస్ రోడ్డు వద్ద శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం రోజున బలిజిపేటలోని సంత తోట, పాచిపెంట మండలం వేటగానివలసలో, శనివారం నాడు మక్కువలోని నంద, గుమ్మలక్ష్మీపురం మండలంలో గొరడ, సీతానగరంలోని మార్కెట్ వద్ద, సీతంపేటలోని కుసిమి, సాలూరులోని తోనాం బస్టాండ్ వద్ద ఈ శిబిరాలను నిర్వహించి ప్రజలకు ఆరోగ్యసేవలందించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ఎన్నికైన పాలకొండ డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గం

రెవెన్యూ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పాలకొండ రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా కలెక్టరేట్ ఎఒ జి.శ్రీరామ్మూర్తి, పార్వతీపురం డిటి ప్రసాదరావు వ్యవహరించగా, పరిశీలికులుగా బలిజిపేట తహశీల్దార్ పి.బాలమురళీకష్ణ వ్యవహరించారు. ఎన్జీవో డివిజన్ గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాదం దగ్గరుండి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిపించారు. డివిజన్ అధ్యక్షులుగా సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒ ఎం.సావిత్రి, కార్యదర్శిగా పాలకొండ సిఎస్‌డిటి పి.సన్యాసిరావు, పాలకొండ హెచ్‌డిటి ఎంఎన్ ప్రసాద్ అసోసియేట్ అధ్యక్షులుగా, కురుపాం హెచ్‌డిటి సురేష్ కుమార్, గుమ్మలక్ష్మీపురం హెచ్‌డిటి ఎన్.శేఖరం, సీతంపేట ఆర్ఎస్‌డి టికె శ్రీవిద్య ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. జియ్యమ్మవలస తహశీల్దార్ కార్యాలయల జూనియర్ సహాయకులు ఆర్.మనోహర్, భామిని ఆర్ఐ పి.మణిప్రభ, పాలకొండ ఆఫీస్ సబార్డినేటెడ్ మీనాక్షి జాయింట్ సెక్రెటరీగా నియమితులయ్యారు. సీతంపేటకు చెందిన వి.గణేష్‌బాబు కోశాధికారిగా, పాలకొండ ఎలక్షన్ జూనియర్ సహాయకులు ఎన్.ఆశ కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

అదేవిధంగా వీరఘట్టం తహశీల్దార్ సాయి కామేశ్వరరావును జిల్లా రెవెన్యూ కార్యదర్శిగా నియమించాలని కోరుతూ డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ తరపున ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

పర్యాటక పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లాలో పర్యాటక హృదయాన్ని దోచేలా అందమైన దృశ్యాలను బంధించి రీల్స్ రూపంలో వీడియోలు చేసి బహుమతులు గెలుచుకోవాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటిడిఎ పరిధిలోని పర్యాటక ప్రాంతాలు, ఏజెన్సీ ప్రకృతి అందాలతో పాటు జిల్లాలోని పర్యాటక అందాలను, చారిత్రాత్మక ప్రదేశాలను 60 సెకన్ల లోపు రీల్స్ చిత్రీకరించి ఈనెల 30లోగా manyampublicity@gmail.comనకు పంపించిన వారిలో ఉత్తమ రీల్స్‌కు బహుమతులను కలెక్టరు వారు అందజేయనున్నట్లు పిఒ తెలిపారు. ఈ జిల్లా స్థాయి పర్యాటక పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలును కలెక్టర్ చేతులమీదుగా ఇవ్వనున్నట్లు పిఒ తెలిపారు. కావున ఆసక్తి కలిగిన వారు ఈ పోటీల్లో పాల్గొనాలని పీవో తెలిపారు.

మీ కోసం వెబ్ సైట్‌లో పిజిఆర్ఎస్ అర్జీల నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అర్జీల వివరాలు మీ కోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించుటకు సెల్లార్ లో ప్రత్యేకంగా సెల్ ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవాలన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామని రూ.7.5 లక్షలకు టోకరా

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో కొండాడ పంచాయతీ బెనరాయికి చెందిన ముగ్గురు గిరిజనుల నుంచి రూ. 7లక్షలు, 50 వేలు ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇదే మండలం కోదులు గుమ్మడ వీర గొట్టం చెందిన గంట కమలాకర్‌రావు, అతని భార్య రత్న మోసగించినట్టు బాధితులు గూడంగి రమేష్, ఆరిక నాగేశ్వరరావు, బిడ్డిక కామేశ్వరరావు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే కొదుల గుమ్మడ వీర గొట్టంకు చెందిన గంట కమలాకర్‌రావు, అతని భార్య రత్న కలిసి కొండాడ పంచాయతీ బెనరాయి చర్చి పాస్టర్‌గా వెళ్లి గూడంకి రమేష్, ఆరిక నాగేశ్వరరావు, బిడ్డిక కామేశ్వరరావుతో పరిచయం చేసుకున్నారు. ఆ పరిచయం అదునుగా తీసుకొని స్వచ్ఛభారత్‌లో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తానని, మరో ఇద్దరికి స్కూల్లో అటెండర్లు ఉద్యోగులు ఇప్పిస్తానని ఒక్కొక్కరికి వద్ద రూ.2,50,000 చొప్పున వసూలు చేశారు. ముగ్గురు వద్ద ఏడు లక్షల 50 వేలు వసూలు చేశారు ఉద్యోగాలు ఇప్పించకపోవడం సరికదా డబ్బులు ఇవ్వకపోవడంతో సీతంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై వై.అమ్మనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తూరు మండలం మెట్టూరులో కమలాకరరావు, రత్న నివాసం ఉంటున్నారు. పాస్టర్ కమలాకరరావు పరారీలో ఉన్నారని, ఆయన భార్య రత్న అందుబాటులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

చలో విశాఖ డెయిరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

24న చలో విశాఖ డెయిరీ

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 24న తలపెట్టిన చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి పాల రైతులు సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు మండలంలోని చినభోగిలిలో పాల రైతుల సమస్యల సాధనకై పోస్టర్ విడుదల చేసిన అనంతరం రైతు సంఘం నాయకులు బంటు దాసు, రెడ్డి లక్ష్మీనాయుడు మాట్లాడారు. ఈనెల 24న గాజువాక పరిధిలో గల అక్కిరెడ్డిపాలెంలో ఉన్న విశాఖ డైరీ వద్ద జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నామని, గతంలో విశాఖ డెయిరీ అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని, వేరే ఆస్తులను రక్షించాలని, పాల సేకరణ ధర లీటరుపై పది రూపాయలు పెంచాలని, చనిపోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారమివ్వాలని, పశువులకు ఉచిత బీమా, మందులు, దాణా 75శాతం రాయితీతో ఇవ్వాలని, విశాఖ డైరీ పాల రైతులదని, మన డెయిరీని అవినీతిపరుల నుంచి కాపాడుకోవడానికి మనమంతా కదిలి మన డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిహెచ్.కృష్ణ, బి.అప్పారావు, సింహాచలం, సత్యం, రామలక్ష్మి, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి' బస్సులకు బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్త్రీ శక్తి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటికీ మహిళలు కొంత ఇబ్బంది పడుతున్నారని జనచేతన కోఆర్డినేటర్ బగాది శశిభూషణ చౌదరి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంగా కల్పించడంతో మహిళలు బస్సులు ఎక్కినప్పుడు కొంత ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతి డిపోలోనూ స్త్రీశక్తి పేరుతో కొన్ని బస్సులు కేటాయిస్తే మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

నేటి నుంచి కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణంలో సోమవారం నుంచి వచ్చే అక్టోబర్ 2 వరకు కోట దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఉదయం 8 గంటలకు రావట్లేసి అమ్మవారు నిజరూప దర్శనం కల్పించనున్నారు. మొదటి రోజు సుమారు మూడు వేలు దాటి యాత్రికులు వస్తారని అంచనా వేస్తున్నారు. పది రోజులు అన్నదానం సందర్భంగా వచ్చిన యాత్రికులకు ఆరు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.

గట్టి బందోబస్తు

దసరా ఉత్సవాలకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీతో పాటు ఇద్దరు సిఐలు, 150 మంది సిబ్బందిని ఉత్సవాలకు నియమించారు. ఆదివారం సాయంత్రం డిఎస్‌పి ఎం రాంబాబు, సిఐ ఎ.ప్రసాదరావు సమావేశమై సిబ్బంది తగు సూచనలు, సలహాలు అందించారు. వచ్చిన యాత్రలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

పట్టణంలో కురుస్తున్న వర్షం

పట్టణంలో భారీ వర్షం

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో ఉన్న రహదారులు జలమలమయ్యాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పెద్ద కాలువలతో పాటు, 15వ వార్డు నుంచి 30 వార్డుల వరకు కాలువల్లో పూడికతీతలు తీయకపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా వర్షపు నీరు రహదారులపైనే ప్రవహిస్తుంది. దీంతో స్థానిక ప్రజలు రహదారిపై వచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

పర్యాటకులతో కిటకిటలాడుతున్న పార్కు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో సీతంపేట మండలం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లోని అందాలను ఆశ్వాదించారు. జల విహార్ వద్ద బోట్ షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సర్ వేశారు. సాహసేపితమైన క్రీడ ఎక్కారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

అధ్వానంగా రహదారులు... ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బట్టిగూడ, గదబవలస, కాగితాడ, బల్లగుడ్డు, రామాపురం, కె.ఇచ్ఛాపురం, రాయిమానుగూడ తదితర గ్రామాలకు చెందిన రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మండలంలో అడపా దడపా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల రహదారులు బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యు.వెంకంపేట- చిదిమి, బిటివాడ- ఎంవి పురం, పివిఆర్ పురం- డెప్పివలస గ్రామాల మధ్య రహదారులు వర్షాలకు బురదమయంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినా నేటికీ ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎక్కడికైనా వెళ్లాలంటే ఇబ్బందులుపడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రాంతాలకు బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని, స్థానికులు కోరుతున్నారు.

గతుకులమయమైన యు వెంకంపేట-చిదిమి రోడ్డు

రెగ్యులర్ కమిషనర్ వచ్చేందుకు విముఖత ఎందుకో ?

- గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో ఇన్‌ఛార్జి, ఎఫ్‌ఎసి కమిషనర్లతోనే పాలన
- ప్రకటనలకే పరిమితమైన మౌలిక సదుపాయాలు
- మున్సిపాలిటీపై కన్నెత్తి చూడని పాలక వర్గం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్ వచ్చేందుకు ఎందుకు విముఖత చూపిస్తున్నారో అన్న విషయం ఎవరికీ అంతుపట్టడంలేదు. గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఉన్న మున్సిపాలిటీకి ఇన్‌ఛార్జి, ఎఫ్‌ఎసి కమిషనర్లతోనే పాలన సాగుతోంది. దీంతో పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ప్రకటనలకే పరిమితమవుతుందా అన్న విమర్శలు వెళ్ల వెత్తుతున్నాయి. పైరవీలకు అలవాటు పడుతున్న అధికారులు అంచనాలకు మించి ప్రతిపాదన చేస్తూ బిల్లులు పెట్టుకుంటున్నారన్న గుసగుసలు కార్యాలయంలో వినిపిస్తున్నాయి. సి-బిల్లులు, ఆయిల్ బిల్లులు, జీతాలు పెట్టుకునేందుకే కార్యాలయంలోని పలు విభాగాల అధికారులు విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. ఇంత జరుగుతున్నా కౌన్సిలర్లు గానీ, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గానీ పట్టించుకోకపోవడం శోచ చనీయం.

స్థానిక మున్సిపాలిటీ గ్రేడ్-1 స్థాయిలో ఉన్నప్పటికీ గత ఏడాది అక్టోబర్‌లో బదిలీపై వెళ్లిన రెగ్యులర్ కమిషనర్ కోన శ్రీనివాస్ తర్వాత ఇన్‌ఛార్జి కమిషనర్, ఎఫ్‌ఎసి కమిషనర్లతోనే మున్సిపల్ పాలన సాగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 12న గ్రేడ్-2 మేనేజర్ స్థాయిలో ఉన్న సిహెచ్.వెంకటేశ్వర్లు ఒన్ పే కింద విధులు నిర్వహించేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో సిడిఎంఎ కార్యాలయాల నుంచి ఉత్తర్వులు రావడంతో కమిషనర్‌గా విధుల్లోకి చేరారు. ఆయన విధుల్లో చేరిన ఆరు నెలల్లోనే మున్సిపల్ కార్యాలయ అధికారులతో నెలకొన్న వివాదాల కారణంగా ఆగస్టు 5న సిడిఎంఎ కార్యాలయానికి సరెండర్ అవ్వాలని ఉత్తర్వులు రావడంతో ఆగస్టు 9న ఇన్‌ఛార్జి కమిషనర్‌గా డిఇ జి.శ్రీనివాసరాజును నియమిస్తున్నట్లు ఉత్తర్వులు వచ్చాయి. అయితే జీతాల బిల్లులు, పెట్టుకునేందుకు, ఆయిల్, ఇతరత్రా బిల్లులు పాస్ చేసేందుకు ఆయనకు అవకాశం లేదు. దీంతో ఆగస్టు 28న సిడిఎంఎ కార్యాలయం నుంచి ఎఫ్‌ఎసి కమిషనర్‌గా నియమిస్తున్నట్లు వచ్చిన ఉత్తర్వులతో అయిష్టంగానే ఆయన బాధ్యతలను నెట్టుకొస్తున్నారని చెప్పవచ్చు.

గ్రేడ్-1 స్థాయి మున్సిపాలిటీకి గ్రూప్-2 స్థాయి కమిషనర్‌ను సిడిఎంఎ కార్యాలయం నియమించకపోవడం పట్ల పలు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర దృష్టి పెట్టకపోవడం శోచనీయం. పార్వతీపురం మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌గా వచ్చేందుకు ఎవరూ సుముఖత చూపించకపోవడానికి కారణాలు తెలియడంలేదు. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో పట్టణ అభివృద్ధి ఎక్కడ

వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. వీటితో పాటు 30 వార్డుల్లో ప్రజలకు అందాల్సిన కనీస మౌలిక సదుపాయాలు అందడం లేదనే విమర్శలు కూడ వినిపిస్తున్నాయి. మున్సిపల్ పాలనపై దృష్టి పెట్టాల్సిన పాలక పక్ష కౌన్సిల్ సభ్యులు కనీసం మున్సిపాలిటీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇదే అదునుగా కార్యాలయంలో గల పలు విభాగాల అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం లేక ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఎవరికి నచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారు. కార్యాలయానికి వచ్చామా, వెళ్లామా అన్న చందంగా వ్యవహరిస్తుండడం ఒక ఎత్తయితే, కార్యాలయంలో జవాబుదారీతనం లేకపోవడం కూడా పలు విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాల్టీ అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యేతో పాటు పాలకవర్గ సభ్యులు మున్సిపాలిటీపై దృష్టి సారించి రెగ్యులర్ కమిషనర్ నియమకంపై దృష్టి పెట్టి మున్సిపల్ పాలనను గాడిలో పెట్టి, పట్టణ అభివృద్ధికి చొరవ చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గిరిజన నాయకుల్ని నిర్బంధించడం తగదు

ప్రజాశక్తి - సాలూరు

జిఒ 3 పునరుద్ధరణపై గిరిజనులకిచ్చిన హామీలపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేయడానికి వచ్చిన పాడేరు జిల్లా గిరిజన నిరుద్యోగ సంఘాల నాయకులను పోలీసులు నిర్బంధించడం తగదని ఆదివాసీ జెఎసి వైస్ చైర్మన్ కె.ఉదయ్ కుమార్, మండల నాయకులు నిమ్మక అన్నారావు, ఎస్.ప్రవీణ్ చంద్, ఎం.భీమారావు ఖండించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన నిరుద్యోగ యువకులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ సంఘాల నాయకులు మంత్రి సంధ్యారాణి నివాసానికి వెళితే పోలీసులచే నిర్బంధించడం అన్యాయమని అన్నారు. గతంలో మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పలు గిరిజన సంఘాల నాయకులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆయన నివాసానికి వెళ్ళారని, ఆయన ఎప్పుడూ నిర్బంధాలకు పాల్పడలేదన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కును కూడా పోలీసులచే అణిచివేయడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో టిడిపి ఇచ్చిన హామీలను అమలు చేయాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారని, గొంతెమ్మ కోరికలు కోరడం లేదని వారు అన్నారు.

ఒడిశా పథకాలు తీసుకోవాలని ఒత్తిడి

తిరస్కరించిన దిగువశెంబి,దూళిభద్ర గిరిజనులు

ప్రజాశక్తి - సాలూరు

ఒడిశా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తీసుకోవాలని కోరుతూ అధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. గత కొద్ది నెలలుగా వివాదాస్పద కొటియా గ్రామాల్లో దిగువ శెంబి, ఎగువ శెంబి, దూళిభద్ర, పట్టు చెన్నూరు, పగుల చెన్నూరు గ్రామాలకు గిరిజనులు ఒడిశా సంక్షేమ పథకాలను తిరస్కరించారు. అంతే కాకుండా ఒడిశా ప్రభుత్వం నడుపుతున్న పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు తమ పిల్లలను పంపించడం మానేశారు. దీంతో పొట్టంగి,కొరాపుట్ అధికారులతో కలిసి మాజీ ఎమ్మెల్యే జయరాం పాంగి సోదరుడు రజిత్ పాంగి ఆదివారం ధూళిబద్ర, దిగువ శెంబి గ్రామాల గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఒడిశా ప్రభుత్వం అందిస్తున్న పింఛను, రేషన్ సరుకులను తీసుకోవాలని ఆయన కోరారు. అయితే తాము తీసుకోమని గిరిజనులు స్పష్టం చేశారు. దీనితో ఒడిశా నాయకులు, అధికారులు వెనుదిరిగారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా మధ్యాహ్న భోజన కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.తులసమ్మ ప్రభుత్వాన్ని కోరారు. కొమరాడలో ఆదివారం జరిగిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత పాతికేళ్లుగా అరకొర వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో సొంత డబ్బులు పెట్టుకుని, అప్పులు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారని అన్నారు. సకాలంలో వంట బిల్లులు అందడం లేదని, దీనికి తోడు ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు వంట నిర్వాహణను అప్పగించి తమ పొట్టలు కొట్టాలని చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ఏ నెలకా నెల బిల్లులు, జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపుల ఆపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సందర్భంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా భవిష్యత్తు పోరాటానికి గానూ మధ్యాహ్న భోజన కార్మికులంతా ముందుకు రావాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు, ఈనెల 26న కొమరాడలో జరుగు మధ్యాహ్న భోజన కార్మికుల సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, మండల కార్యదర్శి కొల్లి సాంబమూర్తి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు మరడాన సునీత, బి.కళావతి, ఎం.అప్పలనరసమ్మ, గంగమ్మ, పార్వతి పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో పర్యాటక ప్రాంతాలు

తాడికొండ, కుసా జలపాతాల అభివృద్ధికి వినతి

టూరిజం అభివృద్ధిపై కలెక్టర్ దృష్టి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో జలపాతాలు పర్యాటకుల మనసును పరవశింపజేసి ప్రకృతి ఒడిలో పచ్చదనంతో ఎంతగానో ఆకర్షింప చేస్తున్నాయి. ఎతైన కొండల నడుమ జాలువారే జలపాతంలో అందం ఆహ్లాదం తాండవిస్తున్నాయి. వీటిని వీక్షించిన పర్యాటకులు అంతులేని ఆనందంతో మంత్రముగ్ధుల వుతున్నారు. మన్య ప్రాంతంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

మండలంలోని తాడికొండ, కుసా గ్రామాల పరిసర ప్రాంతాల్లో గల జలపాతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గుమ్మలక్ష్మీపురం మన్యంలో ఉన్న జలపాతాల వద్దకు పండగలు, వనభోజనాలు సమయంలో శ్రీకాకుళం, పార్వతీపురం, ఒడిశా ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సేద తీరేందుకు సరైన సౌకర్యాల్లేవు. పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని గత కొన్నేళ్లుగా ఐటిడిఎ అధికారులు ప్రణాళికలు చేస్తున్నా అది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. పనులు ప్రారంభించే సమయానికి అధికారులు బదిలీపై వెళ్లడం, దీంతో ఆ పనులు మధ్యలో ఆగిపోవడం పరిపాటిగా మారింది. దీంతో పర్యాటక ప్రాంత అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. తాడికొండ పర్యాటక ప్రాంతం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుంది. పర్యాటక ప్రాంతాల వద్ద విశ్రాంతి గుడారాలు, షాపులు, చిన్నపిల్లల పార్క్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే పర్యాటకులు రావడానికి ఆసక్తి చూపుతారని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు.

తాడికొండ పర్యాటక ప్రాంతం పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

పర్యాటక ప్రాంతాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

కొత్తగా బాధ్యతలు చేపట్టిన మన్యం జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఇందులో భాగంగానే గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యటన సందర్భంగా తాడికొండ జలపాతాన్ని పరిశీలించారు. పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేసే ఆలోచన ఉన్నట్లు చెప్పారు. కుసా జలపాతం కూడా ఎంతో చూడముచ్చటగా ఉంటుందని, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని గిరిజన నాయకులు నిమ్మక సింహాచలం కలెక్టర్‌ను కోరారు. కుసా వాటర్ ఫాల్ ఫోటోలు తీసి తనకు పంపించాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ చొరవతోనైనా ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాలు అభివద్ధి చెందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

జాడలేని జిసిసి పెట్రోల్ బంకు ఏర్పాటు

అధికారుల నిర్లక్ష్యమే గిరిజనులకు శాపం

ప్రజాశక్తి - కొమరాడ

ఐటిడిఎ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జిసిసి ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన పెట్రోలు, డీజిల్ అందించడంతో పాటు గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో పదేళ్ల క్రితం అధికారులు నిర్ణయించారు. అయితే జిసిసి అధికారుల నిర్లక్ష్యం ఒక ఎత్తు అయితే, ప్రైవేట్ బంకు ఏర్పాటుకు కొంతమంది జిసిసి అధికారులే వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎంతో ఆశతో ఎదురుచూసిన జిసిసి పెట్రోల్ బంకు ఏర్పాటు కాకపోవడంతో ఈ ప్రాంత గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొమరాడలో జిసిసి పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తామని భూసేకరణ కూడా పూర్తయింది. అయితే జిసిసి అధికారుల తీరుతో పెట్రోలు బంకు ఏర్పాటు జాప్యం పట్ల గిరిజన నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐటిడిఎ, జిసిసి ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అంతర్ రాష్ట్ర రహదారికి ఆనుకొని ఉన్న దేవుకొన వద్ద తొలుత భూసేకరణ జరిగింది. ఆ భూముల్లో దేవుకోన గ్రామానికి చెందిన రైతులకు పట్టాలు ఇచ్చారనే ఉద్దేశంతో అక్కడ పెట్రోల్ బంకు ఏర్పాటుకు అవకాశం లేదని అధికారులు తేల్చి చెప్పారు. అనంతరం కొమరాడ పోలీస్ స్టేషన్ సమీపాన అంతర్‌రాష్ట్ర రహదారి పక్కన స్థల పరిశీలన చేసి బంక్ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. ఇంతలోనే మండల కేంద్రంలో ఒక ప్రైవేటు పెట్రోలు బంకు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో జిసిసి పెట్రోలు బంకు ఏర్పాటు చేయకుండా ఉండేందుకు ఆశాఖ అధికారులకు కొంత మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తరపున జిసిసి పెట్రోల్ డీజిల్ బంకు ఏర్పాటైతే తమ బంకుకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంటుందని భావించి ప్రైవేట్ నిర్వాహకులు జిసిసి బంకును అడ్డుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. దీంతో సుమారు ఏడాది పాటు జిసిసి బంకు ఏర్పాటుకు అధికారులు ముందుకు

పెట్రోలు బంకు కోసం సేకరించిన స్థలం

రాకపోవడమే ఈ అనుమానాలకు బలం చేకూరుతుంది. ఏది ఏమైనా కొమరాడ మండల కేంద్రంలో జిసిసి పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తే అన్ని రకాలుగా జిసిసికి ఆదాయంతో పాటు ఈ ప్రాంతం గిరిజన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని పలువురు గిరిజన సంఘాల నాయకులు అంటున్నారు. కావున ఇప్పటికైనా జిసిసి అధికారులు, ఐటిడిఎ పిఒ యశ్వంత్ రెడ్డి స్పందించి మండల కేంద్రంలో జిసిసి బంకు ఏర్పాటు చేసి గిరిజన ప్రజలకు, ప్రజలకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించి గిరిజన యువతి యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

క్రీడామైదానంలో నిల్వ ఉన్న వరద నీరు

అధ్వానంగా క్రీడా మైదానం

లక్షలాది రూపాయలు నీటిపాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) క్రీడ మైదానం అధ్వానంగా తయారైంది. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్రీడా మైదానాన్ని అభివృద్ధిపర్చేందుకు పిఎం శ్రీ పథకం కింద రూ.5 లక్షలు అంచనా వ్యయంతో క్రీడా మైదానం అభివృద్ధి పనులు చేపట్టారు. అధికారుల అలసత్వం వల్ల గుత్తేదారులు ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో లక్షలాది రూపాయలు నీటిపాలయ్యాయని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు క్రీడా మైదానం బురదమయంగా మారింది. ఈ క్రీడా మైదానం వృద్ధులు, యువకులు వ్యాయామం చేసుకునేందుకు ఎంతో ఉపయోగపడేదని, అనేక మంది యువకులు పోలీస్ కానిస్టేబుల్, ఆర్మీ, సిఎస్‌ఎఫ్, బిఎస్‌ఎఫ్, ఇతరత్రా ఉద్యోగాలు పొందారు. అయితే క్రీడా మైదానం అధ్వానంగా ఉండడంతో ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. క్రీడా మైదానం నీరంతా బాలికల ఉన్నత పాఠశాల వైపు నిల్వ ఉండిపోవడంతో క్రీడాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డోలు వాయిద్యంలో మండల వాసికి దక్కిన గౌరవం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

శ్రీవాగ్దేవి వాయిద్య సంగీత కళా నృత్య సంస్కృత సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో అన్ని వాయిద్య పరికరాలతో ఐదు వేల మందితో నిర్వహించిన స్వర సప్త సంగీత వాయిద్య నృత్య సమ్మేళనంలో మండలంలోని సంత గౌరమ్మపేట గ్రామానికి చెందిన తీడ భాస్కరరావుకు డోలు వాయిద్యంలో కాంస్య బహుమతి, ప్రశంసా పత్రం లభించిందని ఆయన తెలిపారు. ఈ బహుమతిని సంగీత కళ విద్వాంసులు జి. చంద్రశేఖర్, ప్రోగ్రాం ఆర్గనైజర్ బి.నాగేంద్రయాదవ్ చేతుల మీదగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత వాయిద్య కళాకారులు పాల్గొన్నారు.

ఐటిడిపి ప్రధాన కార్యదర్శికి పరామర్శ

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని బొండపల్లి పంచాయతి గొల్లలపేట గ్రామానికి చెందిన నియోజకవర్గ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి పీతల అప్పలనాయుడును మండల టిడిపి నాయకులు ఆదివారం సాయంత్రం పరామర్శించారు. ఇటీవల అప్పలనాయుడుకు జరిగిన ప్రమాదంలో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు రాపాక అచ్చంనాయుడు, బొండపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు, సర్పంచ్‌లు నడుపూరి భాస్కరనాయుడు, మీసాల జానకిరావు, సీనియర్ టిడిపి నాయకులు ఉప్పలపాటి చిరంజీవి రాజు, బోదంకి వెంకటరమణ, పడాల అప్పలనాయుడు, రాపాక అప్పల నాయుడు, చంద్ర నారాయణ తదితరులు అప్పలనాయుడును పరామర్శించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు.

సర్వసిద్ధికి కీర్తిచక్ర అవార్డు

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రపంచంలోనే ప్రసిద్ధ గాంచిన బొబ్బిలి వీణల కేంద్రంలో పని చేస్తున్న వీణాల కళాకారుడు సర్వసిద్ధి గంగాధరాచారి కీర్తిచక్ర అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీఆర్యాణి సకల కళా వేదిక మూడో వార్షికోత్సవం సందర్భంగా హస్త కళాకారులను సత్కరించింది. హైదరాబాద్ రవీంద్ర భారతిలో శనివారం స్వర్ణ మకర కంకణంతో గంగాధరాచారిని సత్కరించి కీర్తిచక్ర అవార్డును అందించారు. అయోధ్య రామాలయానికి బేబినాయన ఆర్డర్ ఇచ్చిన వీణను గంగాధరాచారి తయారు చేస్తున్నారు.

వృద్ధ మహిళలకు సిఐ వితరణ

రేగిడి : మండలంలోని వావిలవలస గ్రామంలో రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన సత్రంలో తలదాచుకున్న నిరుపేద వృద్ధ మహిళలకు రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర రావు ఆదివారం తన పోలీస్ సిబ్బందితో వితరణగా చీరలు పంపించి మానవత్వం చాటుకున్నారు. నిరుపేద వృద్ధ మహిళలకు ఇలా సాయం చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఈ సత్రంలో 30 మంది వృద్ధ మహిళలకు అన్నదానం చేస్తున్న సామాజిక కార్యకర్త సిద్ధార్ధను అభినందించారు.

శశిభూషణరావుకు అవార్డు

విజయనగరం : సత్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ రావుకు త్రేతాయుగ్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకమైన డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్ విజనరీ మెంటర్ అవార్డు - 2025 తో సత్కరించి ంది. విద్యా నైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో, నాయకత్వం, నిబద్ధత ద్వారా విద్యా విలువలను బలోపేతం చేయడంలో శశిభూషణరావు చేసిన ఈ అవార్డును ప్రదానం చేశారు.

ముహారాజశ్రీ సీనియరు సివిల్ జడ్జి, బొబ్బిలి వారి దివ్యసముఖమునకు
I.A.No.180/2024, I.A.No.181/2024, I.A.No.182/2024, I.A.No.183/2024
A.S.No.17/2017

బిట్వీన్:
తెన్నేటి నారాయణమూర్తి
....పిటీషనరు-అప్పిలెంటు

మరియు :
తెన్నేటి కృష్ణ మూర్తి (Died) వగైరా
.....రెస్పాండెంట్లు ప్రతిపాదిత రెస్పాండెంట్లు

నోటీసు

టు: **R.9 :** తెన్నేటి లీలావతి భర్త లేటు శ్రీను రావు, అగ్రహారం వీధి, బెలగాం, పార్వతీపురం పట్టణం మరియు జిల్లా, ఎ.పి.
R.10 : తెన్నేటి సాకేత్ తండ్రి లేటు శ్రీను రావు,
- Rest do -
R.11: తెన్నేటి దీక్షిత తండ్రి లేటు శ్రీను రావు,
- Rest do -

పై నెంబరు అప్పీలు దావాలో సి.పి.సి ఆర్డరు.22, రూలు. 4, ఆర్డరు.22, రూలు.9, సెక్షన్. 5. లిమిటేషన్ చట్టం మరియు ఆర్డరు.32, రూలు.3 మరియు సెక్షన్. 151 సి.పి.సి ప్రకారం పిటీషన్లు దాఖలు చేయగా సదరు పిటీషన్లలో శ్రీకోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపుచున్నప్పటికిన్నీ మీరు తప్పించుకు తిరుగుచున్నందున యిందు మూలముగా తెలియచేయునది ఏమనగా మీరు **తే.25-09-2025 ది న ఉదయం 10-30 గంటలకు** స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరయి మీ జవాబు దాఖలు మోచేసుకోవలెను. లేనియెడల పై నెంబరు దావా మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందుమూలముగా తెలియచేయడమయినది.

(పై శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం)

పి. మోహన మురలీ కుమార్,
అడ్వకేట్,
బొబ్బిలి, విజయనగరం జిల్లా
Mobile No.9440878450

బొబ్బిలి
తే 21-9-2025 ది